teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

ఈ నెల 25 నుంచే పరీక్షలు

క్యూఆర్ కోడ్ సదుపాయంతో విద్యార్థులకు ఊరట




ములుగు | సంపుటి : 04 | సంచిక : 226 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 20 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## మావోయిస్టులపై లాస్ట్ పంచ్

### దేశవ్యాప్తంగా మిగిలింది 300 మందే

ఆపరేషన్ కగారుతో భద్రతా దళాల విరుచుకుపాటు

దేవూజీ, మల్లా రాజారెడ్డి అగ్రనేతలే టార్గెట్‌గా దళాల వేట



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా మావోయిస్టుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్చి 31 గడువు దగ్గరపడుతుండటంతో భద్రతా దళాలు లాస్ట్ పంచ్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులపై ఇప్పటికే విరుచుకుపోడుతున్న భద్రతా బలగాలు ఇంకా ఎంత మంది మిగిలిఉన్నారన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం

మిగతా 2 లో

## గూగుల్ సెర్చ్ లింకులన్నీ నిజం కావు

సైబర్ మోసాలపై సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక

యాడ్స్ ద్వారా తిమ్మిని బమ్మిని చేస్తున్న నేరగాళ్లు




హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగ్‌లతో మోసాలపై హైదారబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్ వేదికగా కీలక వివరాలు వెల్లడించారు. ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే

మిగతా 2 లో



## ఉచితాల సంస్కృతి

# దేశ అభివృద్ధికి గొడ్డలి పెట్టు

### సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

### రాష్ట్రాల తీరుపై ధర్మాసనం ఆగ్రహం

ఉచితాల సంస్కృతి దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. దేశంలోని చాలా రాష్ట్రాలు రెవెన్యూ లోటుతో ఉన్నప్పటికీ, అభివృద్ధిని పట్టించుకోకుండా ఉచితాలను అందిస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.



02



సీఎం రేవంత్ రెడ్డికి

## హైకోర్టులో ఊరట

భూపాలపల్లి కేసులో హాజరు నుంచి మినహాయింపు

గండ్ర వెంకటరమణారెడ్డి కేసులపై హైకోర్టు ఆదేశాలు

.. వివరాలు 2లో



## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీలో మార్పు

చైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ నియామకం

అధికారికంగా జీవో నంబర్ 236 విడుదల

.. వివరాలు 2లో

## మార్చి 15లోపు నామినేటెడ్ పదవుల భర్తీ

కాంగ్రెస్ శ్రేణులకు పీసీసీ చీఫ్ తీపి కబురు

ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో రాష్ట్ర మంత్రుల కీలక భేటీ

పాలన, పార్టీ నిర్మాణంపై చర్చ

.. వివరాలు 5లో

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మార్చ్ పాలిటిక్స్

రైజింగ్ 2047 విజన్‌పై అధిష్ఠానంతో కీలక చర్చలు

ఖర్గే, రాహుల్ గాంధీలతో ముఖ్యమంత్రి బృందం భేటీ

రాష్ట్ర అభివృద్ధి రోడ్‌మ్యాప్‌పై సమీక్ష



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అభివృద్ధి పథాన్ని మరింత వేగవంతం చేయాలనే దృఢ సంకల్పంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సహచరులు, రాష్ట్ర సీనియర్

మిగతా 2 లో



## తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ

మేలో ముహూర్తం ఖరారు చేసిన కవిత

తెలంగాణ' పేరుతోనే కొత్త ప్రస్థానం

జూబ్లీహిల్స్ వేదికగా కవిత కీలక ప్రకటన

02

## ఏఐ కత్తి రెండు వైపులా పదునున్న అస్త్రం

- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రధాని ప్రసంగం
- 500 టెక్ దిగ్గజ కంపెనీల సీఈవోలతో సదస్సు



.. వివరాలు 6లో

## నాడు గ్యారంటీ కార్డులు నేడు బాకీ కార్డులు

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
- బడ్జెట్‌పై అల్టిమేటం
- 95 శాతం హామీలు పెండింగ్‌లోనే
- రెండేళ్ల పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్వజం



6



## వినాశకాలే విపరీత బుద్ధి

పోలీసులూ తస్మాత్ జాగ్రత్త

రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు నిప్పులు

జైల్లో బాల్క సుమన్‌ను పరామర్శించిన హరీశ్

అక్రమ అరెస్టులపై తీవ్ర ఆగ్రహం

# ఉచితాల సంస్కృతి దేశ అభివృద్ధికి గొడ్డలి పెట్టు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ఉచితాల సంస్కృతి దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. దేశంలోని చాలా రాష్ట్రాలు రెవెన్యూ లోటుతో ఉన్నప్పటికీ, అభివృద్ధిని పట్టించుకోకుండా ఉచితాలను అందిస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ అందించాలని ప్రతిపాదించిన తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. అందరికీ ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కంటే ఉపాధి మార్గాలను తెరవడానికి రాష్ట్రాలు కృషి చేయాలని ధర్మాసనం పేర్కొంది. అభివృద్ధి ప్రాజెక్టులకు ఖర్చు చేయడానికి బదులుగా, రాష్ట్రాలు రెండు పనులు చేయాలని – జీతాలు చెల్లించడం మరియు అంత పెద్ద మొత్తంలో పంపిణీ చేయాలని పేర్కొంది. రాష్ట్రాలు ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచిత ఆహారం ఇవ్వడం ప్రారంభిస్తే, తర్వాత ఉచిత సైకిల్, తర్వాత ఉచిత విద్యుత్తు ఇవ్వడం ప్రారంభిస్తే, ఎవరు పని చేస్తారు, ఆపై పని సంస్కృతికి ఏమి జరుగుతుందో ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

తమిళనాడులో ఉచిత విద్యుత్ అందించాలని ప్రతిపాదించిన డీఎంకే ప్రభుత్వం నేతృత్వంలోని విద్యుత్ పంపిణీ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి, ఇతరులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యుత్ సవరణ నిబంధనలు, 2024లోని నియమాన్ని విద్యుత్ సంస్థ సవాలు చేసింది. విద్యుత్ ఛార్జీలను నోటిఫై చేసిన తర్వాత తమిళనాడు సంస్థ అకస్మాత్తుగా పన్నులను ఎందుకు సడలించాలని నిర్ణయించుకుందని ధర్మాసనం ప్రశ్నించింది.

సంక్షేమ చర్యలో భాగంగా, రాష్ట్రాలు విద్యుత్ ఛార్జీలు చెల్లించలేని వారికి అందించాలని కోరుకుంటున్నాయని, కానీ భరించగల వారికి, చెల్లించలేని వారికి మధ్య తేడాను గుర్తించకుండా పంపిణీ చేయడం ప్రారంభించడం అర్థమయ్యే విషయమేనని ధర్మాసనం పేర్కొంది. ఇది సంతృప్తికరమైన విధానం కాదా అని ప్రశ్నించింది.

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మార్క్ పాలిటిక్స్

మొదటి పేజీ తరువాయి

నాయకులతో కలిసి న్యూఢిల్లీలో పార్టీ జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఏఐసీసీ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర అభివృద్ధిపై చర్చించింది. ప్రధానంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్, దాని వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక వాగ్దానాల అమలు, విధానపరమైన నిర్ణయాలు, అభివృద్ధి పురోగతి, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు, నిర్మాణాత్మక సంస్కరణలపై అధిష్ఠానానికి సమగ్రంగా వివరించారు. సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావాన్ని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. డిసెంబర్ 2023లో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి మహిళలు, రైతులు, యువత సాధికారత కోసం చేపట్టిన విప్లవాత్మక చర్యలను నాయకత్వానికి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, జిల్లాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి లభిస్తున్న విశేష ప్రజా మద్దతు, తదితర అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జాతీయ నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకత్వం తెలంగాణ సమగ్ర, సమాన అవకాశాల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు.



## మావోయిస్టులపై లాస్ట్ పంచ్



మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా కేవలం 300 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని తాజాగా సీఆర్పీఎఫ్ (ఖ+ఐ-2) వెల్లడించింది. వీరంతా ప్రధానంగా ఛత్తీస్ గఢ్-తెలంగాణ సరిహద్దులు జార్ఖండ్ లోని కొన్ని ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం.

**సెంట్రల్ కమిటీలో నలుగురే:**

మొత్తం 300 మంది మావోయిస్టులు ఉంటే అందులో సెంట్రల్ కమిటీ కి చెందిన వారు కేవలం నలుగురు మాత్రమే ఉననట్లు సీఆర్పీఎఫ్ వర్గాలు తెలిపారు. గణపతి, దేవుజీ, మల్లా రాజారెడ్డి, మిసిర్ బెస్రా మాత్రమే సెంట్రల్ కమిటీ నుంచి మిగిలినట్లు ఈ వార్గాలు పేర్కొన్నాయి. నిజానికి గతేడాది వరకు సీసీఎం సభ్యులు 20 మంది ఉండగా ఆ సంఖ్య ఇప్పుడు నాలుగుకు పడిపోయింది. ఈ నలుగురి కోసం భద్రతా దళాలు 24 గంటలు పని చేస్తున్నాయని వర్గాలు తెలిపారు. ముఖ్యంగా దేవూజీతో పాటు జూనియర్ క్యాడర్ కేశా సోధిని పట్టుకోవడానికి భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భారీగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. 'నక్సల్స్ మిషన్-2026'లో భాగంగా సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు 'కేజీహెచ్-2' (కర్రె గుట్టలు హిల్స్-2) పేరుతో రెండు రోజుల క్రితం నుంచి 2 వేల మందితో కూడిన బలగాలతో సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టగా అక్కడ గురువారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారవర్గాలు వెల్లడించాల్సి ఉంది.

**భారీగా తగ్గిన హింస:**

గతేడాది భద్రతా సిబ్బంది నిర్వహించిన సంయుక్త ఆపరేషన్లలో 370 మంది మావోయిస్టులు చనిపోయారని. 2,391 మంది మావోయిస్టులు, సానుభూతిపరులు లొంగిపోగా 1,175 మందిని అరెస్టు చేసినట్లు సీఆర్‌పీఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. ఇక 2010 మరియు 2025 మధ్య మావోయిస్టుల హింస 88 శాతం తగ్గిందని ఇటీవల కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటుకు తెలియజేశారు. దీంతో పౌరులు, భద్రతా సిబ్బంది మరణాలు కూడా గణనీయంగా తగ్గినట్లు వెల్లడించారు. 2010లో 1,005 గా ఉన్న మరణాలు 2025లో 100కి 90 శాతం తగ్గాయని షా చెప్పారు.

## గూగుల్ సెర్చ్ లింకులన్నీ నిజం కావు

మొదటి పేజీ తరువాయి

గూగుల్ లేదా ఇతర సెర్చ్ ఇంజిన్లలో వెతకడం మనకు అలవాటు అయితే, ఈ అలవాటే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోందని తెలిపారు. సెర్చ్ ఇంజిన్లలో టాప్‌లో కనిపించే వెబ్‌సైట్లు లేదా స్పాన్సర్డ్ అని ఉన్న లింకులు అన్నీ సురక్షితమైనవి కావని గుర్తించాలన్నారు. కేవలం సెర్చ్ ఫలితాల్లో పైన కనిపించినంత మాత్రాన అది అసలైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.




**నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం**

సైబర్ ముఠాలు ఇప్పుడు అధునాతన 'సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్' (ఎస్‌ఈవో) పద్ధతులను, పెయిడ్ యాడ్స్‌ను ఆసరాగా చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ పోర్టల్స్, బ్యాంకులు, ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేర్లతో అచ్చం అసలైన వాటిని పోలి ఉండే 'ఫిషింగ్' వెబ్‌సైట్లను సృష్టిస్తున్నాయని తెలిపారు. వీటిని సెర్చ్ రిజల్ట్స్‌లో అగ్రస్థానంలో ఉండేలా జాగ్రత్త పడుతున్నాయని, వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్ల కోసం లేదా పేమెంట్ సర్వీసుల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ లింకులు పైన కనిపిస్తాయని తెలిపారు. అవి నిజమేనని నమ్మి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుందని సూచించారు.


**వివరాలు ఇచ్చారో.. విలవిలలాడాల్సిందే!**

ఈ నకిలీ వెబ్‌సైట్లలోకి వెళ్లిన వెంటనే మీ వ్యక్తిగత వివరాలు, లాగిన్ పాస్‌వర్డ్‌లు లేదా బ్యాంకింగ్ వివరాలను నమోదు చేయమని అడుగుతారని అన్నారు. ఒకసారి మీరు ఆ సమాచారాన్ని ఇస్తే, క్షణాల్లో మీ ఖాతా ఖాళీ అయిపోతుందని తెలిపారు. కేవలం ఆర్థిక నష్టమే కాకుండా, మీ పేరిట ఉన్న డాక్యుమెంట్లను దొంగిలించి 'ఐడెంటిటీ థెఫ్ట్'కు పాల్పడే అవకాశం కూడా ఉందని సీపీ హెచ్చరించారు.

**రక్షణ మార్గాలు ఇవే**

- యూఆర్‌ఎల్ చెక్ చేయండి. వెబ్‌సైట్ అడ్రస్‌ను క్షుణ్ణంగా పరిశీలించండి. స్పెల్లింగ్ చిన్న తేడా ఉన్నా అది నకిలీదని గుర్తించాలి.
- నేరుగా టైప్ చేయండి. సెర్చ్ ఇంజిన్లలో వెతకడం కంటే, అధికారిక వెబ్‌సైట్ చిరునామా తెలిస్తే నేరుగా అడ్రస్ బార్‌లో టైప్ చేయడం సురక్షితం.
- సెర్చ్ రిజల్ట్స్‌లో 'హజూశీఅంశీతీవస' లేదా 'ూాస' అని ఉంటే వాటిని క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు అప్రమత్తత అవసరం.
- ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేయండి లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయండి.
- గుర్తుంచుకోండి ఆన్‌లైన్ ప్రపంచంలో అప్రమత్తతే మీకు రక్షణ కవచం అంటూ ట్వీట్‌లో సజ్జనార్ రాసుకొచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): హైకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. 2023లో భూపాలపల్లి పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో తనపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు చేశారని మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లో గండ్ర వెంకటరమణారెడ్డి రెండు ఫిర్యాదులు చేశారు. అయితే ఈ రెండు కేసులను కొట్టివేయాలని సీఎం రేవంత్ రెడ్డి సైతం గతంలోనే క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా భూపాలపల్లి కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణకు స్వీకరించిన కోర్టు భూపాలపల్లి కోర్టులో హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అంతకుముందు కౌంటర్ దాఖలుకు గండ్ర వెంకటరమణారెడ్డి తరపు న్యాయవాది కోర్టును కోరారు.

## తెలంగాణ 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' జ్యూరీలో మార్పు



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్ ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2025కు సంబంధించి జ్యూరీ కమిటీలో కీలక మార్పు చోటుచేసుకుంది. స్పెషల్ అవార్డ్స్ జ్యూరీ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కమిటీ చైర్మన్‌గా ఉన్న ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు స్థానంలో తమ్మారెడ్డి భరద్వాజను నియమిస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం జీవో నంబర్ 236ను విడుదల చేసింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంపిన నివేదికను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 4న విడుదల చేసిన మునుపటి ఉత్తర్వులకు (+.రా.ౕ. చీశీ.166) సవరణగా ఈ కొత్త ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రజా గాయకుడు గద్దర్ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రారంభించింది. సినీ రంగంలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాలను అందజేయనున్నారు. ముఖ్యంగా స్పెషల్ అవార్డ్స్ కేటగిరీలో విజేతలను ఎంపిక చేసే బాధ్యతను ఇప్పుడు తమ్మారెడ్డి భరద్వాజ నేతృత్వంలోని కమిటీ పర్యవేక్షించనుంది. తమ్మారెడ్డి భరద్వాజకు సినీ పరిశ్రమపై ఉన్న అపారమైన అవగాహన, అనుభవం ఈ ఎంపిక ప్రక్రియకు మరింత వన్నె తెస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నియామకానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో మరో పార్టీ పురుడు పోసుకోబోతోంది. గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటూ, సొంత బాటను ఎంచుకున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే మొదటి వారంలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. కొత్త పార్టీ పేరుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో కవిత కీలక క్లారిటీ ఇచ్చారు. తమ పార్టీ పేరులో ఖచ్చితంగా 'తెలంగాణ' అనే పదం ఖచ్చితంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని తన ఫస్ట్ ఛాయిస్ సిద్దిపేట, సెకండ్ ఛాయిస్ బోధన్ అని కవిత స్పష్టం చేశారు. రాష్ట్ర అస్తిత్వాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఈ పేరు ఉంటుందని సమాచారం. కాగా, గత కొన్ని నెలలుగా 'జనం బాట' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న కవిత, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆమె మద్దతుదారులను ఏఐబీఎఫ్ పార్టీ బీ-ఫామ్‌పై పోటీ చేయించి తమ ఉనికిని చాటుకున్నారు. ఈ క్రమంలోనే అధికారికంగా పార్టీని స్థాపించి, 2029 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఎన్నికల క్షేత్రంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది.

## ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల (మార్చి 2026) హాల్ టికెట్లను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి గురువారం విడుదల చేసింది. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు బోర్డు పేర్కొంది.

**కళాశాలల్లోనే హాల్ టికెట్ల పంపిణీ**

ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను ఆయా కళాశాలల ఆన్‌లైన్ లాగిన్‌లలో అందుబాటులో ఉంచినట్లు బోర్డు తెలిపింది. విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాల్ టికెట్లను తీసుకోవాలని సూచించింది. హాల్ టికెట్లలో విద్యార్థుల వివరాలకు సంబంధించి ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకువచ్చి సరిచేసుకోవాలని అధికారులు కోరారు.

**పరీక్షా కేంద్రాల గుర్తింపునకు క్యూఆర్ కోడ్**

విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాన్ని సులభంగా వెతుక్కునేందుకు వీలుగా ఈ సారి హాల్ టికెట్లపై ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'ను ముద్రించారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ ఎక్కడ ఉందో సులువుగా తెలుసుకోవచ్చు. విద్యార్థుల సౌకర్యార్థం మొబైల్ ద్వారా కూడా హాల్ టికెట్లను పొందే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. విద్యార్థులు బోర్డు వద్ద నమోదు చేసుకున్న (రిజిస్టర్డ్) మొబైల్ నంబర్లకు నేరుగా ఎస్ఎంఎస్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ లింక్‌ను పంపనున్నట్లు టీజీబీఐఈ వెల్లడించింది.

## వ్యవసాయ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పరీక్షలు, జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్, రైతు నేస్తం, డిజిటల్ వ్యవసాయ మిషన్, కేంద్ర ప్రభుత్వ పథకాలకు రైతుల నమోదు, సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్, పిఎం కిసాన్, ఎరువుల విక్రయాలపై యాప్ పై అవగహన, రైతు బీమా తదితర వ్యవసాయ అంశాలపై గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నూరు శాతం అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న, చిట్టచివరి రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి దూరం కాకుండా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా కార్మిక వ్యయాలు తగ్గించి దిగుబడులు పెంచే విధంగా రైతులను ప్రోత్సహించాలని, భూసార పరీక్షల ద్వారా సరైన ఎరువుల వినియోగంపై రైతులకు అవగహన కల్పించాలని తెలిపారు. జాతీయ ఆహార భద్రత పోషకాహార మిషన్ కింద పంటల ఉత్పాదకత పెంపు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. డిజిటల్ వ్యవసాయ మిషన్, పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలలో అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తిచేయాలని, నమోదు చేసుకున్న రైతులకు రైతు బీమా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. రైతు నమోదు చాలా తక్కువగా ఉందని వారంలో పూర్తి చేయాలని స్పష్టంచేశారు. సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్ కింద రసాయన రహిత సాగుకు రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. యూరియా కొరకు రైతులు యాప్ ద్వారా నమోదుకు రైతు వేడుకల్లో అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల నాణ్యత నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వ్యవసాయ రంగం జిల్లా ఆర్థికాభివృద్ధికి కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ పాల్, రమేష్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి



పరకాల, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): గురువారం మేడారం సమ్మక్క--సారలమ్మ వనదేవతలను మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గద్దెల వద్ద మొక్కలను చెల్లించుకున్నారు. వనదేవతల ఆశీస్సులతో పరకాల నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## టిలా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్దన్



ఆదిలాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): నార్నూర్ మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన జాధవ్ గునాజీ కుమారుడు జాధవ్ దినేష్ టిల స్వగ్రామం భీంపూర్ లో ఘనంగా జరిగింది. ఇట్టి టిలా కార్యక్రమానికి భోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ తో కలిసి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ హాజరయి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట జాధవ్ దిలీప్, మాజీ సర్పంచ్ విష్ణు, రోహిదాష్, గుణవంత్ రావ్, రాథోడ్ రమేష్, రమేష్ టీచర్, మాజీ ఎంపీపీ గోవింద్, జాధవ్ రోహీదాష్, యశ్వంత్ రావు, ఆడే దత్త, గోకుల్ టీచర్, జాధవ్ బాలాజీ,జాధవ్ జాలం, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య - స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై సుదీర్ఘ సమీక్ష

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖల పై ప్రోగ్రాం అధికారులు, మండల వైద్యాధికారులు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులు, సూపర్వైజర్లు సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించాలని, భృణ హత్యలను నివారించాలని, క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించాలని, లింగ నిర్ధారణ చేయడం నేరమని తెలియజేసే విధంగా క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అన్ని శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆడపిల్లలను సంరక్షించాలని, ప్రస్తుత ఆధునిక వైద్యశాస్త్రంలో సాధించిన ప్రగతి వలన గర్భస్థ పిండ ఆరోగ్య స్థితిని పరీక్షించేందుకు అనేక ఆధునిక వైద్య పరికరాలు సౌకర్యాలు ప్రక్రియలు పరీక్షలు చౌకగా అందుబాటులో ఉన్నందున సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేస్తున్నారని దీనిని అరికట్టేందుకు, ప్రభుత్వం (నియంత్రణ మరియు దురుపయోగ నివారణ చట్టం) 1994 పిసిపిఎన్డిటి, ప్రవేశపెట్టి క్షేత్రస్థాయిలో నిఘ,తఖీలు నిర్వహించి పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మరింత వేగంగా జిల్లాలో ఈ చట్టంపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అందుకు క్షేత్రస్థాయిలో అంగన్వాడి, ఆశ కార్యకర్తలు సిడిపిఓలు మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో కలిసి పనిచేసి ఈ చట్టంలో పక్కాగా అమలు చేయాలని సూచించారు. అందుకు పోలీస్ యంత్రాంగం సహాయం తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో పౌష్టిక ఆహారంతో పాటు చిన్న పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్య బోధనలు అందించాలని, స్త్రీ,శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పక్కాగా క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ తనిఖీ చేయాలని ఆదేశించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఆడపిల్లలను సంరక్షించాలని, భృణ హత్యలకు అస్సలే పాల్పడవద్దని, పుట్టే శిశువు ఆడ, మగ అయినా స్వీకరించాలని, అందుకు స్వచ్ఛంద సంస్థలు, జిల్లా స్థాయి కమిటీలు వైద్య ఆరోగ్యశాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పని చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పక్కాగా ఈ చట్టంపై సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ప్రతి మాసము క్రమం తప్పకుండా ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హాస్పిటల్స్ ను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, సంక్షేమ శాఖ అధికారిని సబిత, సిడబ్ల్యూసి చైర్పర్సన్ నాగవాణి, అన్ని మండలాల వైద్య అధికారులు, సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## కెరీర్ ఎక్స్‌పో - 2026 విజయవంతం




మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): మెగా ప్లేస్మెంట్, కెరీర్ ఎక్స్పో -- 2026 తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాల మహబూబాబాద్ లో మెగా ప్లేస్మెంట్ కెరీర్ ఎక్స్పో -- 2026 విజయవంతం. ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమానికి లేబర్‌నెట్ ఫౌండేషన్, జిల్లా ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, ఇడిసి మద్దతు అందించాయి. మొత్తం 240 మంది విద్యార్థినులు పాల్గొనగా, ప్రముఖ సంస్థలు అయిన యంగ్ ఇండియా, టెక్ మహీంద్రా, టెలిపెర్ఫార్మెన్స్, మెడ్‌ప్లస్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితర సంస్థలు నియామక ప్రక్రియ నిర్వహించాయి. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 116 మంది విద్యార్థినులకు జాయినింగ్ ఆర్డర్లు లభించగా, మొత్తం 48శాతం ప్లేస్మెంట్ సాధించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని ఆర్‌సిఓ శ్రీమతి పి. రత్నకుమారి ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డా. ఎం.బిందు మాధురి పర్యవేక్షణలో ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. శోభా దేవి సమన్వయంతో, జిల్లా ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ శ్రీమతి రజిత సహకారంతో, అధ్యాపకులు, ప్లేస్మెంట్ సెల్, డీఈఈటీ, ఈడీసీ మరియు వివిధ కంపెనీల హెచ్.ఆర్. మేనేజర్లు సమిష్టి కృషితో విజయవంతం అయినట్లు ఆర్ సి ఓ శ్రీమతి రత్న కుమారి మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిందు మాధురి ఆనందం వ్యక్తం చేశారు.

## ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళా



మహబూబాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళాను ఈ నెల 20వ న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి. ధర్మేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాను జిల్లా కలెక్టరేట్ లోని రెండవ అంతస్తులో గల రూం. నెం. ఎస్.4. గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ కార్యాలయము నందు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇతర వివరాల కొరకు వి. ధర్మేంధర్ ఫుడ్ సేఫ్టీ అధికారి సెల్.నెం. 9000284353 ను సంప్రదించగలరని అన్నారు.

## చక్రవర్తి శివాజీ చరిత్ర వక్రీకరించడం సరైనది కాదు

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**



జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ 396 జయంతి పురస్కరించుకొని జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయం వద్ద వారి భారీ చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ నాయకులు జోహార్లు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ హాజరై మాట్లాడుతూ చత్రపతి శివాజీ కాలంలో అనేకమంది రాజులు ఉన్నప్పటికీ కేవలం శివాజీని దేశ ప్రజలందరూ కొనియాడడం వెనకాల శివాజీ సంక్షేమం దాగి ఉన్నదని కానీ నేడు బిజెపి, ఆర్ ఎస్ ఎస్ శివాజీని హిందూ ప్రతినిధిగా కొలవడం వల్ల అసలు చరిత్ర మరుగున పడుతుందని కావున శివాజీ చరిత్రను వాస్తవాలతో ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం నేడు బహుజనులకు అందరికీ ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ ఒక బహుజన కులంలో పుట్టి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి రాజుగా పట్టాభిషేకం చేయడానికి పూనుకుంటే నాటి బ్రాహ్మణులు ఒక శూద్రుడు రాజ్యాన్ని ఏల్లడాన్ని సహించని వారు పట్టాభిషేకం చేయకుండా అడ్డుకున్నారని అట్టి పరిస్థితుల్లో కొలకత్తా నుండి వచ్చినటువంటి బ్రాహ్మణుడు తన ఖాళీ బొట్టనివేలుతో తిలకం దిద్ది పట్టాభిషేకం చేశాడని ఈ విధంగా నాడు బ్రాహ్మణ వర్గం శూద్రులను,బహుజనులను రాజులుగా నిరాకరించిందని అన్నారు. శివాజీ అన్ని మతాల వారిని సమానంగా చూసుకొని తన సైన్యంలో 30 శాతం ముస్లింలను నియమించుకొని సాయుధ గారాన్ని, అంగరక్షకులను ముస్లింలను నియమించుకుని పని చేశాడని అన్నారు. కానీ తన సొంత తల్లి తండ్రి వారి తరఫున ఉన్నటువంటి కులవర్గ సామంత రాజులు శివాజీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని దీన్ని బట్టి ఆనాడు శివాజీని వ్యతిరేకించింది సొంత మతస్తులు, కులస్తులే కానీ ముస్లింలు కాదని ఇటువంటి విషయాలను నేటి యువకులు తెలుసుకొని విద్వేషాన్ని తమ మెదడులో ఉంచుకోకుండా మతసామరస్య విలువను తెలుసుకోవాలని కోరారు. నాడు శివాజీ భూమి లేని రైతులకు భూమి పంచి రుణాలను ఇచ్చి ఆరు సంవత్సరాల వరకు ఎటువంటి పన్నులను విధించకుండా రైతు రాజ్యాన్ని నెలకొల్పితే శివాజీ వారసులుగా చెప్పుకుంటున్నటువంటి బిజెపి రైతులకు రుణాలు ఇవ్వకుండా పన్నుల పైన పన్నులు పెంచుకుంటూ రైతు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, శివాజీ తన రాజ్యంలో ఆడవారి పైన ఆకృత్యాలు చేసే వారి శిరస్సులను తీసివేస్తే నేడు ఆడవారి పైన అత్యాచారాలు చేసిన వారిని బిజెపి ఆర్ఎస్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలకడం ఏ విధంగా వారు శివాజీ వారసులో చెప్పాల్సిందిగా ప్రశ్నించారు. శివాజీ చరిత్రను అందరూ చదివి ప్రజలకు తెలియజేస్తే బూర్జువా మతతత్వ రాజకీయాలు భూస్థాపితమై సమసమాజాన్ని కోరుకునే కమ్యూనిజం గెలుస్తుందని అన్నారు. శివాజీని ఒక ప్రాంతానికి మతానికి కులానికి పరిమితం చేయకుండా ఈ దేశంలో క్షుద్ర బహుజన వర్గాల రాజుగా ప్రచారం చేసి ఏ బ్రాహ్మణులైతే రాజ్యాధికారాన్ని నిరాకరించారు ఆ బ్రాహ్మణ వర్గానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఏసురత్నం, ఉద్యమకారులు బత్తుల సిద్దేశ్వర్, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు, యువజన సమైక్య కార్యదర్శి వెంకటేష్, ప్రజా సంఘాల నాయకులు నరహరి రాహుల్ సంజీవ్ భాస్కర్ జర్నలిస్ట్ నాయకులు రామస్వామి తొండ వెంకట్ సిపిఐ నాయకులు శ్రీనివాస్ సహదేవరెడ్డి, సంజీవ్, చారి,చంద్రయ్య, నర్సింహ కుమారస్వామి,నరసయ్య,ఇమా, దస్తగిరి, కృష్ణ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం

**ప్రమాదాల నివారణకు పటిష్ట కార్యాచరణ**

**మాదకద్రవ్యాల అరికట్టుకు కట్టుదిట్ట చర్యలు**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష నిర్వహించి, ప్రమాదాలకు గల కారణాలు, నివారణ చర్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా వ్యాప్తంగా 38 బ్లాక్ స్పాట్లు, 62 ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి 30లో చంద్రుగొండ మండలం తిప్పనపల్లి యూ-టర్న్ వద్ద ఐదు ప్రమాదాలు నమోదైన నేపథ్యంలో వాటి కారణాలను సమగ్రంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శ్రీ ఇంక్లైన్, అశ్వారావుపేట, నారావారిగూడెం, ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపం, సుజాతనగర్, చుంచుపల్లి, అశ్వాపురం, మణుగూరు, దుమ్ముగూడెం తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి నెలలో ఇప్పటివరకు 24 ప్రమాదాలు నమోదైనట్లు వెల్లడిస్తూ, వాటి కారణాలను విశ్లేషించి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, ఇల్లందు, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్స్, సైన్ బోర్డులు, సూచికల ఏర్పాటు కోసం అవసరమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి నెల జిల్లాలో నమోదవుతున్న ప్రమాదాల వివరాలను పోలీస్, రవాణా మరియు వైద్యశాఖల సమన్వయంతో సేకరించి నేషనల్ హైవే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలలో మృతిచెందిన వారి వివరాల ఆధారంగా అత్యవసర వైద్యసేవలను బలోపేతం చేయాలని సూచించారు. అశ్వరావుపేట పరిధిలో అంబులెన్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దమ్మపేట, అల్లపల్లి, అన్నపురెడ్డిపల్లి రహదారులపై బోలార్డుల ఏర్పాటు, రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టాలని సూచించారు. వర్షాకాలానికి ముందు జిల్లా వ్యాప్తంగా రహదారుల మరమ్మత్తులు పూర్తి చేయాలని, మణుగూరు ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చే పనులు తక్షణం చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌సిసి విద్యార్థులతో నెలలో రెండుసార్లు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలో ఓవర్ స్పీడ్ వల్ల జరిగే ప్రమాదాలపై వీడియో ఆధారిత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రహదారి నిర్మాణాలకు పెండింగ్‌లో ఉన్న అటవీ శాఖ అనుమతులపై నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా స్థాయి మాదకద్రవ్య నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా, సాగు, వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద అత్యాధునిక సాంకేతిక పరికరాలతో నిశిత తనిఖీలు నిర్వహించేందుకు అవసరమైన యంత్రాల ఏర్పాటుపై నివేదికలు సమర్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి డి-అడిక్షన్ సెంటర్లకు తరలించి తగిన కౌన్సిలింగ్ అందించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రుల్లో డి-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు చర్యలు చేపట్టాలని, తొలి దశలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న చైతన్యం కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టి ప్రజలను భాగస్వామ్యం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు,ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా,ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నళిని జిల్లా రవాణా శాఖ అధికారి, పోలీస్ శాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ చిన్నారుల విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకం

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని గవర్నమెంట్ కాలేజీ ఫిసికల్ ఎడ్యుకేషన్, దోమలగూడ లో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వివిధ విభాగాలలో మొత్తం 16 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 11 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుని జిల్లాకు గౌరవం తీసుకువచ్చారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించిన దివ్యాంగ చిన్నారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐడీఓసీ కార్యాలయం కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్ మరియు సర్టిఫికేట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు . శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడం ఆదర్శప్రాయమని అన్నారు. దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలలో భద్రాచలం మండలానికి చెందిన జైష్ణవి డిస్కస్ త్రోలో ప్రథమ బహుమతి సాధించగా, అదే మండలానికి చెందిన చాతుర్య ద్వితీయ స్థానం పొందారు. దమ్మపేట మండలం నుండి శశిముఖ హర్షవర్ధన్ 50 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ బహుమతి సాధించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన మొహమ్మద్ ఆసిఫ్ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం సాధించగా, చరణ్ డిస్కస్ త్రోలో ద్వితీయ బహుమతి సాధించారు. లక్ష్మీదేవిపల్లి మండలం నుండి అనురాధ లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతి సాధించగా, మ్యూజికల్ చైర్ పోటీలో ప్రథమ బహుమతి పొందారు. చుంచుపల్లి మండలం నుండి సాయిచరణ్ లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం సాధించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన భవాని లెమన్ అండ్ స్పూన్ పోటీలో ద్వితీయ బహుమతి, అనిత తృతీయ బహుమతి సాధించారు. మొత్తం నాలుగు ప్రథమ, నాలుగు ద్వితీయ, మూడు తృతీయ స్థానాలతో జిల్లా దివ్యాంగ విద్యార్థులు 11 పతకాలను సాధించి విశేష ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు యస్.కె. సైదులు, ఎన్. సతీష్ కుమార్, సమ్మిళిత శిక్షకులు సిద్దయ్య, శ్రీరామ్, రామారావు, పద్మావతి, శుభకర్, నాగలక్ష్మి, జానకి, నాగశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో కొలువుదీరిన నూతన పాలకవర్గం



ములుగు, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ములుగు మున్సిపాలిటీ నూతన పాలకవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ హాజరై మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జాని మరియు కౌన్సిలర్లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొంది నేడు బాధ్యతలు చేపడుతున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపి నూతనంగా ఏర్పడ్డ ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే విధంగా అందరూ కలిసి ములుగును వెలిగించాలని మంత్రి సీతక్క ఇప్పటికే ములుగు పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేశారని మరింత అభివృద్ధి చేసుకునే విధంగా సహకరించి పనులను చేసుకోవాలని మరొకసారి వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,జిల్లా సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,చైర్మన్లు, డైరెక్టర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ రైతు పంటలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**రైతు కుటుంబాలను అభినందిస్తూ సన్మానించిన కలెక్టర్**



బూర్గంపహాడ్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): బూర్గంపహాడ్ మండలంలోని లక్ష్మీపురం గ్రామ ఆదర్శ రైతులు యారం లక్ష్మీరెడ్డి, మేడిపల్లి ఉదయ్, పోతిరెడ్డి వెంకట్రాంరెడ్డి పంటలను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు మాజీ ఉపసర్పంచ్ శ్రీ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆర్గానిక్ మిర్చి పంటలను మంగళవారం నాడు కలెక్టర్ కు అందజేయగా అట్టి మిర్చి నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేయుటకు నేడు శ్రీకారం చుట్టారు. ఆర్గానిక్ పంటల సాగు పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పలు సందర్భాల్లో రైతులతో ముచ్చటించినట్టు పోతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్గానిక్ వినియోగం వల్ల ఆరోగ్యంతో కూడిన ఆదాయం లభిస్తుందని అన్నారు. అదేవిధంగా రైతులు ఒక్క పంట మీదే ఆధారపడకుండా వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పామ్ ఆయిల్, తేనెటీగల పెంపకం, చేపల పెంపకం వంటి మొదలగు అదనపు ఆదాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఆర్గానిక్ పంటలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచిధర లభిస్తుందని అన్నారు. రైతులు ప్రాణాంతకమైన రసాయన ఎరువులను వీడి, సేంద్రీయ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని రైతులను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎం ఆర్ ఓ ప్రసాద్, అగ్రికల్చర్ అధికారి ఏడీఏ తాతారావు, ఇంటెలిజెన్స్ అధికారి అంజిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాదం రమేష్ రెడ్డి పలువురు రైతులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలోని వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



మణుగూరు, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలోని రామానుజవరం నుండి కొత్త మల్లేపల్లి గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో వాగుపై సుమారు 2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన ఆయన, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా, వంతెన బలంగా మరియు దీర్ఘకాలం నిలిచేలా నిర్మించాలని సూచించారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల మధ్య రాకపోకలకు ఈ వంతెన ఎంతో కీలకమని పేర్కొంటూ, నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, గుండగాని నాగేశ్వరావు, తమ్మిశెట్టి సాంబశివరావు, సాదిని సీతయ్య, కృష్ణరావు, కేతినేని రాజేష్, రాసాల నాగరాజు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రేణుక చౌదరి రూ.10 లక్షల విరాళం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రహరీ గోడ నిర్మాణం నిమిత్తం రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి రూ.10 లక్షలను విరాళాన్ని అందజేశారు చేశారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం సహాయం కోరగా, ఆమె వెంటనే స్పందించి ఈ మొత్తాన్ని అందజేయడం పట్ల గ్రంథాలయ వర్గాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తి, నిరుద్యోగ యువత మరియు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తన వంతు బాధ్యతగా ఈ సహకారం అందించారని తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణంతో గ్రంథాలయానికి భద్రత పెరిగి, పాఠకులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం కార్యదర్శి కే. కరుణ కుమారి హర్షం వ్యక్తం చేస్తూ రేణుకా చౌదరి ఉదారతకు కొత్తగూడెం ప్రజలు, పాఠకులు రుణపడి ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్, గ్రంథపాలకురాలు జీ. మణి మృదుల, విద్యార్థినీ విద్యార్థులు కూడా ఈ సహాయంపై ఆనందం వ్యక్తం చేశారు.

# డెయిరీ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



హనుమకొండ, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): పరకాల ఇందిరా మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు మరింత వేగవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల ఇందిరా మహిళా డెయిరీ పనుల పురోగతిపై డీఆర్డీఏ, సహకార శాఖల అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించిన పనుల పురోగతి, మహిళా సమాఖ్యకు ప్రభుత్వపరంగా అందించే సహాయ సహకారాలు, తదితర అంశాలపై డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి లు కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టామో వాటి గురించిన సమగ్ర వివరాలు సిద్ధం చేయాలని డీఆర్డీవో మేన శ్రీను కు తెలియజేశారు. డెయిరీకి సంబంధించిన సమగ్ర వివరాలు, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని గురించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. 25వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ప్రాసెసింగ్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేసేవిధంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిలో అధికారులు వేగం పెంచాలన్నారు. అందులో భాగంగా నడికూడలో ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ) నిర్మాణ పనులు వేగవంతంగా మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. దామెర రోడ్డు నుండి డెయిరీ ప్లాంట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని పీఆర్ ఈఈ ఆత్మారామ్ కు తెలియజేశారు. రోడ్డు పనులను త్వరగా మొదలుపెట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బీఎంసీయూల ఏర్పాటుకు కావాల్సిన మిషనరీ, క్యాన్లు, వెహికల్ హైరింగ్ కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర ఘాట్ అభివృద్ధిపై పరిశీలన చేసిన అడిషనల్ కలెక్టర్



ఏటూరునాగారం, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): పుష్కర ఘాట్ శుభ్రతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని సర్పంచ్ గద్దల నవీన్ గారు తెలిపారు. ప్రజలు సహకరించి పుష్కర ఘాట్ శుభ్రంగా ఉంచాలని కోరారు. పుష్కర ఘాట్ అభివృద్ధిలో సర్పంచ్ కీలక పాత్ర. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.అదేవిధంగా వివిధ రకాల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయనున్నారని అధికారులు తెలిపారు.

# మూడు తండాలో రేషన్ షాప్ ఏర్పాటు



నర్సింహులపేట, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): దూరం తగ్గింది ప్రజల వద్దకు రేషన్ వచ్చింది ప్రజల యొక్క అవసరాల నిత్య ప్రజలకు సరైన పాలన అందించాలనే ఉద్దేశంతో రేషన్ తీసుకోవడానికి దూరప్రాంతం వెళ్తున్న లోక్యతండ గ్రామపంచాయతీ పరిధిలో మూడు తండావాసులు ఇబ్బందులను గ్రహించిన సర్పంచ్ రాజేందర్ నాయక్ అధ్యక్షతన డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామచంద్రనాయక్ ఈరోజు మూడు తండాలో రేషన్ షాప్ సెంటర్ మరొకటి విభజించి అక్కడే ఉండే విధంగా ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా ఉండేవిధంగా సెంటర్ ను వారు ఏర్పాటు చేశారు. పరిష్కరించినందుకు సర్పంచ్ రాజేందర్ కు ఎమ్మెల్యే రామచందర్ నాయక్ మరియు అధికారులకు ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలిపారు.

# మార్చి 15లోపు నామినేటెడ్ పదవుల భర్తీ



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): మార్చి 15లోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ మంత్రులందరితోనూ కాంగ్రెస్ అగ్రనాయకులు సమావేశం అయ్యారని చెప్పారు. పార్టీ నిర్మాణం గురించి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి చర్చించినట్టు తెలిపారు. ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ అభినందించారని చెప్పారు. ప్రజలు సంక్షేమాన్ని ఆస్వాదిస్తున్నారు కాబట్టే పార్టీని ఆశీర్వదించారని అన్నారు. రాష్ట్రంలో 80శాతం ప్రజలు తమకు మద్దతు ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విధి విధానాల గురించి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. మార్చి 15లోపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు. అంతే కాకుండా రాజగోపాల్ రెడ్డి అంశం గురించి చర్చించామని అన్నారు. త్వరలోనే రాజగోపాల్ రెడ్డిని పిలిచి మాట్లాడతామని స్పష్టం చేశారు.

# టెన్త్‌లో.. టాప్ ర్యాంక్ టార్గెట్



## విజయోస్తు 2.0 తో... విజయం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగాం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): పదవ తరగతి పరీక్షల సమర్థవంతమైన నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధన కోసం చేపట్టిన "విజయోస్తు 2.0" కార్యక్రమం కింద ప్రత్యేక కార్యాచరణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పునాది స్థాయి అక్షరాస్యత సంఖ్యాజ్ఞానం (ఫ్లూ) కార్యక్రమం పురోగతి, పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై అదనపు కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మండల విద్యాధికారులు, క్లస్టర్ హెడ్ మాస్టర్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో గురువారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయోస్తు 2.0 లో భాగంగా జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పాఠశాల స్థాయిలో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. ప్రీ ఫైనల్, మాక్ టెస్ట్‌ల ఫలితాల ఆధారంగా విద్యార్థులను స్థాయి వారీగా వర్గీకరించి బోధన నిర్వహించాలన్నారు. బలహీన, ప్రమాదంలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక రిమీడియల్ తరగతులు నిర్వహించాలని ప్రతి ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులను దత్తత చేసుకొని వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్య ప్రశ్నలు, మోడల్ పేపర్లు బిట్ బ్యాంక్ ఆధారంగా ప్రతిరోజూ సాధన కల్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు రోజువారీ పురోగతిని సమీక్షించి రికార్డు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్య లభించే విరామ సమయాన్ని విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తదుపరి పరీక్షకు సంబంధించిన ముఖ్య అంశాల పునశ్చరణ నిర్వహించాలని... సందేహ నివృత్తి సెషన్లు ఏర్పాటు చేయాలన్నారు. బిట్ పేపర్లు, ముఖ్య ప్రశ్నలపై విద్యార్థులు సాధన చేయాలనీ విద్యార్థుల్లో పరీక్ష భయం తొలగించేలా కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థి చదవడం, అర్థం చేసుకోవడం, గణిత సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాక్ టెస్ట్‌ల ఆధారంగా విద్యార్థులను వర్గీకరించి బోధన చేయాలని ఐటమ్ బ్యాంక్ సిద్ధం చేసి తరగతి గదిలో సాధన పెంచాలన్నారు. ప్రతిరోజు రీడింగ్ పీరియడ్ నిర్వహించి ఇంగ్లీష్ పఠన నైపుణ్యాలు పెంచాలని... గణితంలో సంఖ్యా భావన, నాలుగు ప్రాథమిక గణిత క్రియలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఇంటి వద్ద కూడా సాధన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల బాధ్యతలు, ఎం ఈ ఓ లు పాఠశాలలను తరచూ సందర్శించి అకడమిక్ మానిటరింగ్ నిర్వహించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల పాఠశాలలకు ప్రత్యేక మార్గదర్శకత్వం ఇవ్వాలని హాజరు శాతం పెంపు, విద్యార్థుల ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. విజయోస్తు 2.0 కార్యక్రమం ద్వారా జిల్లాలో పదవ తరగతి పరీక్షల్లో గరిష్ట ఉత్తీర్ణత సాధించడం, కార్యక్రమంలో గుణాత్మక అభ్యాస ప్రమాణాలు పెంపొందించడం లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల పెంపు, సౌకర్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): గురువారం ఐడిఓసి కార్యాలయంలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 పాఠశాలలు పీఎం శ్రీకి ఎంపికైనట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పీఎం పాఠశాలల ద్వారా విద్యా ప్రమాణాలను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పీఎం శ్రీ పథకంలో ఎంపిక చేసి ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు విద్యార్థులకు సైన్స్ మరియు రీసెర్చ్ రంగాల్లో శిక్షణ, క్షేత్ర పర్యటనలు, ఇండస్ట్రియల్ విజిట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు, క్రీడా సామగ్రి, బోధనా సామగ్రి, విద్యార్థులకు ఐడీ కార్డులు, బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్, వృత్తి విద్యా పరికరాలు, చైల్డ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ చర్యలు, విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ (కరాటే) శిక్షణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఈ నెలాఖరులోగా అవసరమైన సామగ్రి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు ఆధారిత హాజరు 100 శాతం నమోదు అయ్యేలా జిల్లా విద్యాశాఖ అధికారి నుండి మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మల చెంతనే చిన్నారులు

## కలెక్టరెట్ లో శిశు సంరక్షణ కేంద్రం

## చిన్నారులతో ప్రారంభించిన కలెక్టర్, డీసీపీ

## సంతోషాన్ని వ్యక్త పరుస్తున్న మహిళ ఉద్యోగులు



జనగాం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): చిన్నపిల్లలు ఉన్న మహిళలు ఆఫీసులకి వెళ్లాలంటే తమ పిల్లల్ని నెలకు వేల రూపాయలను ఖర్చు చేస్తూ డే కేర్ సెంటర్ లో వదిలి వెళ్లడం మనం చూస్తూనే ఉంటాం. అంతా ఖర్చు చేసిన కూడా అక్కడ తమ పిల్లలు ఎలా ఉన్నారో అని అమ్మ మనసు టెన్షన్ పడక తప్పదు. మరి కొంత మంది మహిళా ఉద్యోగులు తమ పిల్లలను అమ్మమ్మ, నానమ్మ దగ్గర వదిలి రావడం తప్పని పరిస్థితి విధుల్లో నిమగ్నం అయినప్పటికీ పాపం ఆ తల్లి మనసు తమ చిన్నారి మీదకు లాగకుండా ఉండదు ఆలాంటి తల్లుల బాధ ను తీర్చాలని వారు పని చేస్తున్న ఆఫీస్ లోనే తమ బిడ్డలను చూసుకునే వెసులుబాటు కల్పించాలన్న కలెక్టర్ ఆలోచన వల్ల కార్పొరేట్ స్థాయి లో ఉన్న ఈ అవకాశం ఇప్పుడు జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు కూడా లభించింది. 5 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలను మహిళా ఉద్యోగులు ఆఫీస్ కి వచ్చేటప్పుడు తమ తో పాటు తమ చిన్నారులని కూడా తీసుకవచ్చి వారిని సంరక్షించేందుకు కలెక్టరెట్ లోని గ్రౌండ్ ఫ్లోర్ లోని +4 లో శిశు సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. అనంతరం కేంద్రంలో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన అట వస్తువుల పరికరాల్లో చిన్నారులు సంతోషంగా ఆడటం చూసి కలెక్టర్, డీసీపీ సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ చిన్న పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులని ఎప్పటికప్పుడు పరిశుభ్రం గా పెట్టాలని, చిన్నారులని జాగ్రత్తగా చూసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఆట వస్తువులతో పాటు చిన్నారులు ఏదైనా నేర్చుకునేలా బొమ్మల పుస్తకాలు, పలకలు, పెన్సిల్స్, డ్రాయింగ్స్ వస్తువులు మొదలైన వాటిని కూడా కేంద్రం లో అందుబాటులో పెట్టాలన్నారు. తమ పిల్లల కోసం ఇంతగా అలోచించి మేము పని చేసే చోట వద్దనే మా చిన్న పిల్లలు కూడా ఉండేలా వారి కోసం ఈ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ కి మహిళా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పిల్లలు ఎలా ఉన్నారో అనే టెన్షన్ ఇక నుండి ఉండదని మహిళా ఉద్యోగులు తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కోదండరాములు, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ విభజన
# "జీవోపై హైకోర్టు ఆగ్రహం"

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ**
**మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలి**
**కేంద్రం, తెలంగాణ సర్కార్‌కు ఆదేశం**



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): జీహెచ్ఎంసీ పునర్విభజన చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోపై కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా ప్రభుత్వం విభజించిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజిస్తూ జీవో నంబర్ 55 ను ప్రభుత్వం జారీ చేసింది. అయితే జనగణన-2027 కోసం జూరిస్డిక్షనల్ ఫ్రీజ్ అమలులో ఉన్న సమయంలో జీహెచ్ఎంసీ పునర్విభజన చట్టవిరుద్ధం అని పేర్కొంటూ జీవో నంబర్ 55ను దరం గురువ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

**జీవోను రద్దు చేయండి:**

ఈ పిటిషన్ గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేషన్ కుమార్ సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున అడ్వొకేట్ రాజ్‌కుమార్ గుమ్మి వాదనలు వినిపిస్తూ జనగణన కార్యక్రమాల కోసం ఒకసారి జ్యూరిస్డిక్షన్ ఫ్రీజ్ ప్రకటించాక మున్సిపల్ సరిహద్దుల మార్పులు, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ అనుమతించబడవని కోర్టుకు దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి చర్యలు ప్రారంభం నుంచే చెల్లవని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల చట్ట విరుద్ధంగా, అధికార పరిధి లేకుండా జారీ చేసిన జీవో 55 ను రద్దు చేయాలని కోర్టును కోరారు. పిటిషనర్ తరఫున వాదనలు విన్న న్యాయస్థానం మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన అనంతరం ఈ కేసును తదుపరి విచాణకు కోర్టు తీసుకోనుంది.

**ఆంక్షల వేళ నిర్ణయం:**

కాగా సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో పడుతూ వస్తున్న జనాభా లెక్కల సెకరణకు రంగం సిద్ధమవుతోంది. హిమాలయ ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లడ్డాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026, అక్టోబర్ 1 నుంచి, రెండో దశలో భాగంగా 2027, మార్చి 1 నుంచి దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో జన గణనను చేపట్టనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే జనగణన నేపథ్యంలో దేశవ్యాప్తంగా 2027 మార్చి 31 వరకు జిల్లా, డివిజన్, మండలం, గ్రామం ఇలా ఏ ఒక్క రెవెన్యూ సరిహద్దును మార్చడానికి వీల్లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఏమైనా మార్చాలంటే 31 డిసెంబర్ 2025లోపే మార్చాలని గతంలోనే మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ జరిగే సమయంలో ఇలా సరిహద్దుల మార్పులపై నిషేధం విధించడం ఆనవాయితీగా వస్తోంది. ఎక్కడా ఎలాంటి సరిహద్దు మార్పులు చేపట్టవద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 11ఫిబ్రవరి 2026 లో జీహెచ్ఎంసీ సరిహద్దులను పునర్ విభజిస్తూ జీవో జారీ చేసింది.

# నాడు గ్యారంటీ కార్డులు "నేడు బాకీ కార్డులు"



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ఇప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈసారి బడ్జెట్‌లో అయినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నిధులు కేటాయించకపోతే తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని రెండు బడ్జెట్లలో హామీల అమలు కోసం కేటాయింపులు చేయని ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయించాలని నాలుగు కోట్ల ప్రజల పక్షాన కోరుతున్నానన్నారు.

**ఇచ్చిన హామీలు నెరవేర్చండి:**

ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని కేటీఆర్ కోరారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. ఆయా వర్గాలకి రెండు సంవత్సరాలుగా ఎగగొట్టిన హామీలను కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈసారి కేటాయింపులు చేయాలన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాన్ని నిలబెట్టుకోవాలన్నారు. 2026-2027 బడ్జెట్‌లో 6 గ్యారెంటీలు, 420 హామీలు, డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే ఎక్కడికక్కడ మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు.

**సీఎం, మంత్రులు ప్రజాక్షేత్రంలో తిరగలేదు:**

కేసీఆర్ హయాంలో తెలంగాణను పంజాబ్‌నే తలదన్నేలా, దేశానికే ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రైతులకు అందిన రైతుబంధును 15 వేలకు పెంచాతమని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. ప్రస్తుతం మీడియాలో, ఇతర మాధ్యమాల ద్వారా వస్తున్న వార్తలు, సమాచారం ప్రకారం రానున్న బడ్జెట్‌లో కూడా అభయహస్తంలో హామీ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలకు నిధుల కేటాయింపు చేస్తున్నట్లు కనబడటం లేదని ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోందన్నారు. పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. నాటి గ్యారంటీ కార్డులే ఇవాళ బాకీ కార్డులై మీ పాపాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తున్నాయి. ప్రజల నోట్లో మట్టి కొట్టిన మీ పాపాల ప్రక్షాళన జరగాలంటే కనీసంఈ సారి బడ్జెట్ లోనైనా మ్యానిఫెస్టోలో హామీల ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే, ఎక్కడికక్కడ మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజాగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు, మంత్రులు ప్రజాక్షేత్రంలో తిరగలేరని హెచ్చరించారు.

# వినాశకాలే విపరీత బుద్ధి

**పోలీసులూ తస్మాత్ జాగ్రత్త**
**రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు నిప్పులు**
**జైల్లో బాల్క సుమన్‌ను పరామర్శించిన హరీశ్**
**అక్రమ అరెస్టులపై తీవ్ర ఆగ్రహం**



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. గురువారం జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాల్క సుమన్ అరెస్ట్ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. క్యాతనపల్లిలో మహిళా కౌన్సిలర్లపై దాడి జరిగితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని బీఆర్ఎస్ నేతల వాహనాలు ధ్వంసమైనా ఫిర్యాదు తీసుకోలేదని మండిపడ్డారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. రాహుల్ గాంధీ మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు.

## తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుకు "భారీ నిధులు విడుదల"

**రూ. 5.80 కోట్లతో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు**





హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల ప్రాంగణాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రాంగణాల్లో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.5,80,00,000 కోట్లు కేటాయిస్తూ బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పనులను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచే తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతులు లభించడంతో త్వరలోనే విగ్రహాల తయారీ, ప్రతిష్టాపన పనులు ప్రారంభం కానున్నాయి.

# దేశీ, విదేశీ సాంకేతికతతో భారీ 'అగ్రి షో

**నేటి నుంచే ఎన్టీఆర్ స్టేడియంలో రైతు జాతర**
**ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో రైతుబడి ఆధ్వర్యంలో ప్రదర్శన**



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో అగ్రి షో పేరుతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు అతి పెద్ద వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రైతుబడి సంస్థ నిర్వాహకులు రాజేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్ బండ్ దిగువన, ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) పక్కన ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల్లో వేలాది మంది రైతులు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. దేశ, విదేశాలకు చెందిన నూతన వ్యవసాయ సాంకేతికతను వివరించేందుకు వందల కంపెనీలు ఈ ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. నూతన యంత్రాలు, ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, విత్తనాలు, మొక్కలు, ఎరువులు, డ్రిప్ పరికరాల వంటివి ఎన్నో ప్రదర్శనకు వస్తాయని, మూడు రోజుల్లో పలు అంశాలపై సదస్సులు సైతం జరుగుతాయని వివరించారు. సందర్శకులు ముందుగానే ఙఙఙ.తీఝుస్త్రతీఅంప్త్రశీఞ.ఙశీఎ వెబ్ సైట్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకోవచ్చని, అలా చేసుకోలేని వాళ్లు నేరుగా రావచ్చని తెలిపారు.

# ఏఐ కత్తి రెండు వైపులా పదునున్న అస్త్రం

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): భారతదేశానికి యువతే బలం, బలగమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026ను ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్, వివిధ దేశాల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, 500లకు పైగా టెక్ దిగ్గజ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సమ్మిట్ అని తెలిపారు. ప్రపంచంలో ఆరో వంతుకు భారత్ ప్రాతినిధ్యం వహిస్తోందని కామెంట్ చేశారు. ఏఐకి కేంద్రంగా ఇండియా రూపాంతరం చెందుతోందని అన్నారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీకి భారత్ కేంద్రంగా ఉందన్నారు. మానవుల సామర్థ్యాన్ని ఏఐ మరింత పెంచుతోందని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేస్తోందనేది కాదని ఇప్పుడు ఏఐతో మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యమని పేర్కొన్నారు.

**దక్షిణాసియాకే గర్వకారణం**

ఏఐ సమ్మిట్ నిర్వహణ భారత్‌కే కాదు, దక్షిణాసియాకే గర్వకారణమని ప్రధాన మోడీ అన్నారు. ఏఐపై తొలినాళ్లలో అనేక సందేహాలు వచ్చాయని యువత ఇప్పుడు ఏఐని ప్రయోజనకరంగా ఉపయోగిస్తోందని అన్నారు. ఏఐ సదస్సు మేడిన్ ఇండియా, భారత్ సృజనకు వేదికగా నిలిచిందని కొనియాడారు. ఈ సదస్సు భారతీయ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు. కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ఈ వేదిక దోహదం చేస్తుందని అన్నారు. ఏఐలో విజన్‌తో పాటు సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మనం అణుశక్తి విధ్వంసాన్ని చూశామని, వికాసాన్ని చూశామని, ఏఐ కూడా అంతేనని అన్నారు. ఏఐ కత్తి రెండు వైపులా పదునున్న అస్త్రమని కామెంట్ చేశారు. భారత్‌కు యువత కొత్త శక్తిగా, ఆస్తిగా మారారని కితాబిచ్చారు. ఏఐ టెక్నాలజీ వినియోగం, వాటి ఫలితాలపై తుది నిర్ణయం మనిషిదే అయి ఉండా ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

**మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి**

ఏఐ మెషీన్ సెంట్రిక్‌గా కాదని హ్యూమన్ సెంట్రిక్‌గా ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. అన్ని రంగాల్లో సమస్యలకు ఏఐ పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. పారదర్శకత్వమే అన్నింటి కంటే ఉత్తమమైన రక్షణ కవచమని ప్రధాని చెప్పుకొచ్చారు. మేడిన్ ఇండియా, భారత్ ఆవివష్కరణల సామర్థ్యం ఏఐ సదస్సు చాటుతోందని అన్నారు. ఏఐ సామర్థ్యం ఆలోచనలకు అందనంత దూరంగా ఉందని తెలిపారు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలని భారత్ ఏఐ పురోభివృద్ధికి ఓ చరిత్రగా నిలుస్తోందని ప్రధాన నరేంద్ర మోడీ అన్నారు.

# జింబాబ్వే ఏకంగా టాప్‌లోకి




టీ20 ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శనతో జింబాబ్వే జట్టు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ 2026లో ఆ జట్టు వరుస విజయాలతో బలమైన పోటీదారుగా ఎదుగుతోంది. గ్రూప్ దశలో అంచనాలను తారుమారు చేస్తూ ముందుకు దూసుకెళుతున్న జింబాబ్వే తాజాగా మరో కీలక విజయాన్ని ఖాతాలో వేసుకుంది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో శ్రీలంక క్రికెట్ జట్టును జింబాబ్వే 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన జింబాబ్వే క్రికెట్ జట్టు చక్కటి బ్యాటింగ్‌తో చివరి ఓవర్ వరకు పోరాడి విజయాన్ని అందుకుంది. ఈ విజయానికి ప్రధాన కారణం జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అద్భుత ఇన్నింగ్స్. అతడి దూకుడైన 45 పరుగులతో జట్టుకు బలమైన ఆధారం ఇచ్చారు. అలాగే బ్రియన్ బెన్నెట్ అజేయంగా 63 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఇద్దరి భాగస్వామ్యం మ్యాచ్ మలుపుతిప్పింది. ఈ గెలుపుతో జింబాబ్వే గ్రూప్-బిలో అగ్రస్థానంలో నిలిచి సూపర్-8 దశకు చేరుకునే అవకాశాలను మరింత బలపరుచుకుంది. ఇదే సమయంలో ముందుగా మాజీ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా జాతీయ క్రికెట్ జట్టుపై సంచలన విజయం సాధించడం జింబాబ్వే ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో గెలిచి ప్రపంచ క్రికెట్‌కు షాక్ ఇచ్చింది.

ప్రస్తుతం జింబాబ్వే దృష్టి తదుపరి మ్యాచ్‌పై నిలిచింది. ఐర్లాండ్ జాతీయ క్రికెట్ జట్టుపై విజయం సాధిస్తే సూపర్-8 దశలో స్థానం ఖాయం అవుతుంది. అదే సమయంలో ఆస్ట్రేలియా టోర్నమెంట్‌కు వీడ్కోలు పలకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మ్యాచ్‌కు ముందు మాట్లాడిన రజా, తదుపరి మ్యాచ్‌లో గెలుపు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గత విజయాలన్నీ మరిచిపోయి, కొత్త మ్యాచ్‌ను కొత్తగా ప్రారంభించాల్సిందేనని చెప్పారు. అంచనాలను మించిన ప్రదర్శనతో జింబాబ్వే ఈ టోర్నమెంట్‌లో డార్క్ హార్స్‌గా మారింది. ఇదే జోరు కొనసాగిస్తే సెమీఫైనల్ అవకాశాలు కూడా దూరంలో లేవని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# చెమటోడ్చి గెలిచారు

2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను టీమిండియా అజేయంగా ముగించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై భారత్ 17 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో టీమిండియా గ్రూప్ స్టేజ్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా సూపర్ 8 రౌండ్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ తన వైఫల్యాల పరంపరను కొనసాగిస్తూ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ డక్ అవుట్ అయ్యాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ కూడా అనూహ్యంగా బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(34 పరుగులు) తిలక్ వర్మ (31 పరుగులు) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. తిలక్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే మొదట్లో ఆచి తూచి ఆడి, ఆ తర్వాత గేర్ మార్చి నెదర్లాండ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 25 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మొత్తం 31 బంతులు ఎదుర్కొని నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 66 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. చివర్లో హార్దిక్ పాండ్యా కూడా సిక్సర్లతో మెరుపులు మెరిపించాడు. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ ఆరు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. 194 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన నెదర్లాండ్స్ విజయం కోసం చివరి వరకు పోరాడింది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసి 17 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. భారత బౌలింగ్ విభాగం ఈ మ్యాచ్‌ను ఒక ప్రాక్టీస్ మ్యాచ్‌గా ఉపయోగించుకుంది. బౌలర్లను మార్చి మార్చి ఉపయోగించుకోవడం వల్ల మ్యాచ్ చివరి వరకు వెళ్ళింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లు తీయగా, శివమ్ దూబే రెండు వికెట్లు సాధించాడు. జస్ప్రీత్ బుమ్రా ఒక వికెట్ పడగొట్టాడు. అయితే, ఈ మ్యాచ్‌లో టీమిండియాకు కొన్ని లోపాలు కనిపించాయి. ఓపెనర్లు ఇద్దరూ త్వరగా పెవిలియన్ చేరడం ఆందోళన కలిగించింది. అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి జట్టులోకి తీసుకున్న వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ కూడా తీయకుండా నాలుగు ఓవర్లలో 36 పరుగులు ఇచ్చాడు. హార్దిక్ పాండ్యా మూడు ఓవర్లలో 40 పరుగులు ఇచ్చాడు. శివమ్ దూబే రెండు వికెట్లు తీసినప్పటికీ, మూడు ఓవర్లలో 35 పరుగులతో 11.67 ఎకానమీతో బౌలింగ్ చేశాడు. సుమారు మూడు క్యాచ్‌లు కూడా డ్రాప్ అయ్యాయి. ఇలాంటి చిన్న జట్టుపైనే ఈ గణాంకాలు ఉంటే, సూపర్ 8లో దక్షిణాఫ్రికాతో తలపడనున్న మ్యాచ్ ఎలా ఉంటుందో చూడాలి. టీమిండియా సూపర్ 8కు ముందు ఈ లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని క్రికెట్ నిపుణులు అంటున్నారు.






# జద్రాన్ ధనాధన్.. కెనడాను చిత్తుచేసిన ఆఫ్ఘాన్

చెన్నై : పొట్టి ప్రపంచకప్‌ను ఆఫ్ఘానిస్థాన్ భారీ విజయంతో ముగించింది. భారీ అంచనాలతో టోర్నీ బరిలోకి దిగిన ఆ జట్టు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమణకు గురైనా ఆఖరి రెండు మ్యాచ్‌లు గెలుచుకుని ఓదార్పు విజయాలనందుకుంది. గ్రూప్-డీలో భాగంగా కెనడాతోచెన్నైలో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ సేన.. కెనడాపై 82 పరుగుల భారీ తేడాతో గెలిచింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ఇబ్రహీం జద్రాన్ (56 బంతుల్లో 95 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) తృటిలో శతకాన్ని మిస్ చేసుకున్నా ఆ జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. జద్రాన్ మెరుపులతో ఆఫ్ఘాన్ 20 ఓవర్లకు 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 200 రన్స్ చేసింది. సెదికుల్లా (44), ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (30) అతడికి అండగా నిలిచారు. భారీ ఛేదనలో కెనడా 33 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి ఆ తర్వాత ఏ దశలోనూ లక్ష్యం వైపుగా సాగలేదు. ఆఫ్ఘాన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఆ జట్టు 118/8కే పరిమితమైంది. హర్ష్ ఠాకర్ (30) టాప్ స్కోరర్. ఈ ప్రపంచకప్‌లో కెనడా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగూ ఓడింది.



# టీమిండియాకు సెహ్వాగ్ వార్నింగ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియాను మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ హెచ్చరించాడు. సూపర్-8 దశలో అసలు సిసలు సవాల్ ఎదురవుతుందని తెలిపాడు. ఇప్పటి వరకు టీమిండియాకు గట్టి పోటీ ఎదురవ్వలేదని, బౌలింగ్ విభాగం బలహీనంగా కనిపిస్తుందన్నాడు. బౌలింగ్‌పై తక్షణ సమీక్ష చేయాలని సూచించారు. నెదర్లాండ్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించి అజేయంగా సూపర్-8కు చేరిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 176 పరుగులు చేయడం భారత బౌలింగ్ బలహీనతను బయటపెట్టిందని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు.'ఇప్పటి వరకు భారత్‌కు అసలైన సవాలు ఎదురవ్వలేదు. తొలి మ్యాచ్‌లో తడబడినా.. తర్వాత నిలకడైన ఆటతీరు కనబరిచింది. అసలైన పరీక్ష సూపర్ 8 దశలోనే ఎదురుకానుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో భారత్ 193 పరుగులు చేసినా.. 176 పరుగులు సమర్పించుకుంది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన జట్టు బౌలింగ్ విభాగంపై ఫోకస్ పెట్టాలి. బౌలింగ్ విభాగం బలోపేతం చేయడంపై సమాలోచనలు చేయాలి. అభిషేక్ శర్మ, శివమ్ దూబే వంటి పార్ట్‌టైమ్ బౌలర్లను పెద్ద జట్లపై వాడటం ప్రమాదం. వారు ఒక ఓవర్‌లో 15 పరుగులు ఇస్తే మ్యాచ్ మూమెంటమ్ మారిపోతుంది. కాబట్టి భారత్ ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి రిస్క్‌లు తీసుకోకూడదు.'అని వీరేంద్ర సెహ్వాగ్ సూచించాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ ఏడుగురు బౌలర్లను ఉపయోగించింది. ప్రధాన బౌలర్లు బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి 9 ఓవర్లలో 53 పరుగులు ఇవ్వగా.. ఇతర బౌలర్లు 11 ఓవర్లలో ఏకంగా 123 పరుగులు సమర్పించుకున్నారు. ఇది ఆందోళన కలిగిస్తోంది. అయితే మ్యాచ్ అనంతరం ఈ వ్యవహారంపై సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. మంచు ప్రభావం కారణంగా తమ బౌలర్లు పరుగులిచ్చుకున్నారని వెనకేసుకొచ్చాడు. సూపర్ 8 దశకు ముందు అందరికీ బౌలింగ్ ప్రాక్టీస్ కల్పించాలనే ఉద్దేశంలో బౌలింగ్ చేయించామని వివరణ ఇచ్చాడు. సూపర్ 8 దశలో టీమిండియా తమ తొలి పోరును పటిష్టమైన సౌతాఫ్రికాతో ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ఆడనుంది.

# ఇటలీపై వెస్టిండీస్ విజయం

## వరుసగా నాలుగో విజయం నమోదు



టీ20 వరల్డ్?కప్?లో వెస్టిండీస్ మరో విజయం ఖాతాలో వేసుకుంది. గ్రూప్ స్టేజ్?లో భాగంగా ఇటలీతో జరిగిన మ్యాచ్?లో విండీస్ 42 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో వెస్టిండీస్ అజేయంగా గ్రూప్ స్టేజ్?ను ముగించింది. బౌలింగ్?లో ఫర్వాలేదనిపించిన ఇటలీ, బ్యాటింగ్?లో తేలిపోవడంతో మూడో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 166 పరుగుల ఛేదనలో ఇటలీ 18 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. విండీస్ బౌలర్లలో షమర్ జోసెఫ్ 4, మ్యాథ్యూ ఫోర్డ్ 3, గుడకేష్ మోటి 2, అకీల్ హొసెన్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. షాయ్ హోప్ (75 పరుగులు, 46 బంతుల్లో; 6ఇ4, 4ఇ6) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. చివర్లో రూథర్?ఫోర్డ్ (24 పరుగులు, 15 బంతుల్లో), మ్యాథ్యూ ఫోర్డ్ (16 పరుగులు, 8 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో కలుగమానే, బెన్ మనెంటి చెరో 2, అలీ హసన్, థామస్ డ్రాకా చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, సూపర్ హాఫ్ సెంచరీతో అదరగొట్టిన షాయ్ హోప్?కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ మ్యాచ్?లో విండీస్ క్రికెటర్ షమర్ జోసెఫ్ అరుదైన ఘనత సాధించాడు. బౌలింగ్?లో నాలుగు వికెట్లు దక్కించుకోవడమే కాకుండా నాలుగు క్యాచ్?లు పట్టాడు. బౌలింగ్?లో మనెంటి, గ్రాంట్, థామస్, అలీ హసన్? వికెట్ల కూల్చాడు. ఇక ఫీల్డింగ్?లో ఆంథనీ మోస్క, సయ్యద్ నఖ్వీ, జేజే స్మట్స్, గియన్ ఇచ్చిన క్యాచ్?లు పట్టాడు. టీ20 వరల్డ్?కప్? హిస్టరీలో సింగిల్ మ్యాచ్?లో నాలుగు వికెట్లు పడగొట్టి, నాలుగు క్యాచ్?లు పట్టిన తొలి క్రికెటర్?గా రికార్డు నెలకొల్పాడు. ఇలా పొట్టి కప్పు చరిత్రలో మునుపెన్నడూ జరగలేదు. తాజా విజయంతో గ్రూప్ సీలో వెస్టిండీస్ టాప్?లో నిలిచింది. గ్రూప్ దశలో నాలుగింట నాలుగు విజయాలతో అగ్రస్థానంలో ఉంది. ఇక ఇప్పటికే సూపర్ 8కు అర్హత సాధించిన వెస్టిండీస్ తదుపరి మ్యాచ్? ఫిబ్రవరి 23న జింబాబ్వేతో ఆడనుంది.

# రెండో టీ20లో ఆసీస్ విజయం

## భారత మహిళల ఆస్ట్రేలియా పర్యటన




ఆస్ట్రేలియా పర్యటనలో రెండో టీ20లో భారత్ మహిళల జట్టుకు ఓటమి ఎదురైంది. మూడు టీ20ల సిరీస్?లో భాగంగా కాన్?బెర్రా వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్?లో ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. 164 పరుగుల ఛేదనలో టీమ్ఇండియా ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులే చేసింది. కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ (36 పరుగులు) టాప్ స్కోరర్. ఆసీస్ బౌలర్లలో అష్లీ గార్డ్?నర్ 3, కిమ్ గార్త్, అనబెల్ సుదర్లాండ్, సోఫీ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. ఛేదనను భారత్ ఘనంగానే ఆరంభించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (29 పరుగులు, 23 బంతుల్లో), స్మృతి మంధాన (31 పరుగులు, 24 బంతుల్లో) మంచి ఆరంభమే ఇచ్చారు. తొలి వికెట్?కు ఈ ఇద్దరూ 50 పరుగులు జోడించారు. అయితే 6.4 వద్ద షఫాలీని సోఫీ ఔట్ చేసి ఆసీస్?కు బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత కాసేపటికే జెమిమా రోడ్రిగ్స్ (4 పరుగులు) స్వల్ప స్కోర్?కే పెవిలియన్ చేరింది. 10వ ఓవర్లో స్మృతి కూడా ఔట్ కావడంతో భారత్ సమం ఇన్నింగ్స్ ముగిసేలోపు 71 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్ బాధ్యతగా ఆడింది. రిచా ఘోష్ (19 పరుగులు) ?తో కలిసి భాగస్వామ్యం నిర్మించే ప్రయత్నం చేసింది. ఈ ఇద్దరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయం దిశగా నడిపించారు. దీంతో 16 ఓవర్లు ముగిసే సరికి టీమ్ఇండియా 123-3 తో నిలిచింది. హర్మన్, రిచా ఉండడంతో భారత్ విజయంపై ధీమాగా ఉంది. అప్పటికి భారత్ విజయానికి 4 ఓవర్లలో 44 పరుగులు కావాలి. 17వ ఓవర్లో మూడో బంతికి హర్మన్ ఫోర్ బాదడంతో పార్ట్?నర్?షిప్ 50 పరుగులు కంప్లీట్ అయ్యింది. ఆ తర్వాతే ఆసీస్ గేరు మార్చింది. వరుస వికెట్లు తీసి భారత్?ను తీవ్రంగా దెబ్బకొట్టింది. అదే ఓవర్ ఐదో బంతికి హర్మన్?ను కిమ్ గార్త్ ఔట్ చేసింది. ఆ తర్వాత చివరి మూడు ఓవర్లలో 37 పరుగులు కావాలి. అయితే 18వ ఓవర్లో 3 పరుగులే రావడమే కాకుండా భారత్ రిచా, దీప్తి వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్ ఓటమి దాదాపు ఖరారైపోయింది. ఆ తర్వాత 19వ ఓవర్లో రెండు, 20వ ఓవర్లో 1 వికెట్ పడింది. చివరి రెండు బంతులకు సిక్స్, ఫోర్ బాదిన క్రాంతి గౌడ్ ఓటమి అంతరాన్ని తగ్గించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జియా వోల్ (88 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో మెరిసింది. బెత్ మూనీ (46 పరుగులు) రాణించింది. టీమ్ఇండియా బౌలర్లలో అరుంధతి రెడ్డి 2, రేణుకా సింగ్ ఠాకూర్ 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో మూడు టీ20ల సిరీస్?ను ఆసీస్ 1- 1తో సమం చేసింది. కాగా, తొలి టీ20లో విజయం సాధించిన టీమ్ఇండియా, రెండో మ్యాచ్?లోనూ నెగ్గి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్? పట్టేయాలని భావించింది. కానీ అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక ఇరుజట్ల మధ్య సిరీస్ డిసైడర్ మూడో మ్యాచ్ ఈనెల 21న జరగనుంది. ఈ మ్యాచ్?కు ఆడిలైడ్ ఓవల్ మైదానం వేదిక కానుంది.




# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.



# ప్రియాంక చోప్రా కాన్ఫిడెన్స్ లెవెల్ ఇది!

సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా ప్రపంచ సినీ దిగ్గజాలు మెచ్చిన డైరెక్టర్ రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీ -వారణాసి-. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా కీలక పాత్రల్లో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా, మహేష్ తండ్రిగా ప్రకాష్ రాజ్ నటిస్తున్నారు. సినిమాలోని కీలక ఘట్టమైన రామాయణ యుద్ధ కాండలో హనుమంతుడిగా మ్యాడీ మాధవన్ కనిపించనున్నాడని వార్తలు షికారు చేస్తున్నాయి. అయితే దీనిపై టీమ్ నుంచి ఇంత వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. అంతే కాకుండా మరి కొన్ని కీలక పాత్రల్లో క్రేజీ స్టార్లు కూడా నటించే అవకాశం ఉందని, వారు ఎవరన్నది త్వరలోనే జక్కన్న అధికారికంగా ప్రకటిస్తారని ఇన్ సైడ్ టాక్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కీలక ఘట్టాల చిత్రీకరణ చేస్తున్నారు. ఇదిలా ఉంటే 2019లో వచ్చిన -ది స్కై ఈజ్ పింక్- తరువాత బాలీవుడ్ సినిమాలకు గుడ్ బై చెప్పిన ప్రియాంక మళ్లీ ఇన్నేళ్ల విరామం తరువాత తిరిగి టాలీవుడ్ మూవీ -వారణాసి-తో ఇండియన్ మూవీస్‌లో రీఎంట్రీ ఇస్తోంది. హాలీవుడ్ సినిమాల్లో నటించి గ్లోబల్ లెవెల్లో క్రేజ్‌ని సొంతం చేసుకుని గ్లోబల్ బ్యూటీగా పాపులర్ అయిన ప్రియాంక చోప్రా .. జక్కన్న మూవీతో రీఎంట్రీ ఇవ్వడానికి పెద్ద రీజనే ఉందట. రీసెంట్‌గా ఓ ఇంటర్నేషనల్ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాల్ని వెల్లడించి షాక్ ఇచ్చింది. అంతే కాకుండా -వారణాసి- మూవీపై కూడా తను ఎంత కాన్ఫిడెంట్‌గా ఉందో స్పష్టం చేసింది. -రాజమౌళికి ఉన్న విజన్ ఎవరికీ లేదు. ఆయనతో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. నా కెరీర్‌పై ఈ సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతున్నాను. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలకు ఇది పూర్తిగా విభిన్నమైనది. ఇండియాలో ఉన్న అత్యుత్తమ దర్శకులలో రాజమౌళి ఒకరు. ఆయన విజనే వేరు. ఆయన సృష్టించే కథలు లార్జర్‌దెన్ లైఫ్ కంటే పెద్దవి. -వారణాసి- నా కెరీర్‌లోనే అత్యంత నిర్ణయాత్మక చిత్రంగా నిలిచిపోతుంది. ఈ సినిమా రిలీజ్ కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను- అంటూ చెప్పుకొచ్చింది. అంతే కాకుండా డైరెక్టర్ రాజమౌళి దార్శనితపై ప్రశంసల వర్షం కురిపించింది. ప్రస్తుతం ప్రియాంక చెప్పిన మాటల నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్

టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు



తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463